యశోద

రాయసం వేంకటశివుడుగారు

లోకములో నెవరిగోడను వారిది. పరుల కష్ట సుఖములు కనిపెట్టువారును, దీనలకు సాయము చేయ పమకట్టువారును, ఎక్కడను మిక్కిలి తక్కువ. తమ రోగుబాగులు గుర్తెఱిగి జీవయాత్ర గడుపుకొనుట తోడనే సామాన్యులకు దినములు గడచిపోవుచున్నవి. ఇంక నితరుల సేమ మారయుటకు వారికి తీఱిక యెక్కడ, తోడుపడుటకు సాధనకలాప మెక్కడ?

గోపబాలికలు

ఒకనాఁటి ప్రాతఃకాలమున అక్కచెల్లెండ్రగు నిరువురు బాలికలు గొల్లపల్లినుండి చేరువనుండు గోపాలపురము వైపునకు నడచిపోవుచుండిరి. అక్కకు పండ్రెండు పదమూఁడేండ్లును, చెల్లెలికి పదియేండ్లును వయస్సుండును. దారిప్రక్కలనుండు చెట్ల క్రిందికొమ్మ లెచటనైన పూసియుండినచో, తన చేతనుండు గిన్నె చెల్లెలి చేతికిచ్చి, అక్క పూవులు కోసి, తన జెడలోఁ గొన్నియును చెల్లెలికిఁ గొన్నియును ముడుచుచుండును. ఎట్టి పూవులను బాలికలకుఁ బ్రియమె. పసరిక మొగ్గలను, నిర్గంధకుసుమములనైన వారు నిరసింపరు! ఇట్లు సింగారించుకొని యా బాలికలు, తమకు జ్ఞప్తికివచ్చిన పాటయొ పదమొ పాడుకొనుచు, మెల్ల మెల్లగ నడుగులువెట్టుచుండిరి.

ఆదారిని నడచిపోవు నొక యువకుఁడు "పిల్లలారా! ఎక్కడకు పోవుచున్నారు? గిన్నెలో నేమున్నది?" అని యడిగెను.

"మేము పట్నం పోవుచున్నాము. పంతులుకు పాలు కొనిపోయి యిచ్చిరండని అమ్మ పంపినది" అని బాలికల యుత్తరము.

అంత నా పథికుఁడు మఱికొన్ని ప్రశ్నలువేసి, వారు గొల్లపిల్లలనియు, రెండు పూఁటలును తల్లి వారిచే పట్టణమందలి విద్యార్థి కొకనికి ఆవుపాలు పంపుచుండుననియుఁ దెలిసికొనెను.

"బాలికలారా! మీ రిట్లు పోయి వచ్చుచుండడముతోనే ప్రొద్దుపోతుందే. మీ రింక చదువుకొనడ మెప్పుడు?" అని మార్గస్థుని ప్రశ్నము.

"ఈమధ్యనే మావూళ్లో పంతులు వచ్చి బడి పెట్టినప్పుడు, అందరుపిల్లలతోపాటు మేమును పలకా బలపమును చేతబట్టి బళ్లోకి వెళ్లినాము. ఇంతట్లో పట్నంలో చదివే పంతులొకరు మా అమ్మకు కనబడి, వేళకు మంచిపాలు తనకు పంపిస్తే, అణా యెక్కువ యిస్తానన్నాడు. అందుచేత మా పొస్తకాలు మూలపడ్డవి. చదువుకేమి, ఈ పంతులుకు వేళకు పాలందిస్తేనేకాని, అమ్మ మొట్టికాయలు మాకు తప్పవు! రావే చెల్లీ, ప్రొద్దెక్కిపోయింది!" అని అక్క కేకవేసి, వేవేగముగ కాలు సాగించెను.

"ఆహా! ధనికుల సౌఖ్యమునకై పేదవా రెట్లు కష్టముల పాలగుచున్నారు! ఆ విద్యార్థి యిచ్చెడి యొక అణా లాభమునకై యిద్దఱు పేదపిల్లల చదువు సమసిపోయినది! స్వలాభాపేక్షతప్ప వేఱు చింత లోకమం దెచటను లేనేలేదు! ఎద్దుపుండు కాకికేమి నొప్పి? చదువుసేర్చి హాయిగానుండవలసిన యీ బాల్యమున పాప మీ పల్లెబాలికలు పరులకు బానిస లయిపోవుచున్నారు!" అని బాటసారి మనమునఁ దలపోయుచు, తన యుద్యోగపుఁ బనులమీఁదఁ వెడలిపోయెను.

చదువు

ఇది జరిగిన రెండు మూఁడు నెలలకు, ఆ బాలిక లిరువురును గోపాలపురమునుండి స్వగ్రామమునకు బయలుదేరి యొక సాయంకాలమున మెల్లగ నడచి పోవుచుండఁగా, వెనుకటి పథికుఁడు వారి కగఁబడెను. ముఖపరిచయముగల యా చిన్నవానిని జూచి యా పిల్లలు చిఱునవ్వు నవ్విరి.

"పిల్లలారా! ఇపుడు మీ సమాచారమేమి? మీరు కొనిపోవుచుండు పాలు పంతులు[illegible]వంట

1016

బట్టుచున్నావా? మీ కష్టము గుర్తెఱిగి ఆయనగారు సరిగా డబ్బిచ్చుచున్నాడా? లేక, యేమైనా చిక్కులు పెట్టుచున్నాడా? పాలచెంబుతోపాటు పలకాపుస్తకాలుచేత బట్టినారే? పట్నంలో ఆడపిల్లల బళ్లో చేరి మీరిప్పుడు చదువుచున్నారా యేమి? ఏదోవిధంగా మీరు చదువుకోవలెను సుమీ!" అని బాటసారి కుశలప్రశ్నము.

"అయ్యా! మా పంతులు మిక్కిలి మంచివాడు. మేము రోజూ వేళకు మంచిపాలు తెచ్చిపెట్టుచున్నందుకు ఆయన సంతోషించి, చెల్లాయికీ నాకూ పెప్పరమింట్లు పెట్టుచున్నాడు. చెల్లీ నేనూ ఆయనకు పాలు కాచిపెట్టుచున్నాము. ఆయనతో మాకెంతో చనువు. ఆయన చదువుకొంటున్నప్పుడు, దగ్గిర పత్రికలు, పుస్తకాలు మేము విప్పి, వాటిలో బొమ్మలు చూచుకొంటున్నాము. అవి చూచి మాకు ప్రాణాలు లేచివస్తవి!" అని యశోద ప్రత్యుత్తరము.

"అక్కయ్యా! బొమ్మలు చూచుకోవడమేగాని మన చదువుమాట చెప్పవేమే?" అని చెల్లెలి వ్యాఖ్య.

"ఆ కఠినుఁడు మీకు చదువుకూడా చెప్పుచున్నాడా యేమి?" అని బాటసారి.

"పంతు లేమీ కఠినుడు కాదండీ. ఆయన పెద్ద పొస్తకాలు, తళతళలాడే ఆయన కళ్లజోడూ చూచి మొదట మేమూరికే భయపడ్డాము కాని, ఆయన మంచివాడే—గూట్లో టిక్కు టిక్కుమనే గడియారం చూదామని చెల్లాయి బెదరుచు వెళ్లుచుండగా, దానిని వెనకకు లాగేదానిని. పంతులుదగ్గిర కాకితాలలో బొమ్మలు చూదామని మనసుగా వుండేదిగాని, అవి నా కెట్లు వస్తాయి?" అని యశోద.

మార్గస్థుఁడు:— "చదువురాని నీ కాకాకితా లెందుకు?"

యశోద:—"బొమ్మలు చూచుకోడానికే లెండి—పంతులు మంచివాడు. ఆయన విసుక్కోక, ఇప్పుడు మా చెల్లాయికి గడియారం చూపిస్తున్నాడు. బొమ్మలు చూచుకోడానికి నాకు కాకితాలిస్తున్నాడు. నాదృష్టి యెపుడూ బొమ్మలమీదనే వున్నదని ఆయన కనిపెట్టి, 'నీవేలచదువుకోవమ్మా?' అని యొకరోజున నన్నాయన అడిగినాడు."

బాటసారి:—"నీ పాలమోతవల్లనే మా చదువు మూలపడ్డదని అతణ్ని నాలుగుజెప్పలూ పెట్టలేక పోతివా?"

యశోద:—"ఆయనను పాపమెవ్వరూ అటువంటి మాటలనలేరండీ! 'అయ్యో, నీ గ్రామంలోని కొత్తబళ్లో మీ చదువు నా మూలాన పాడైపోయిందే!' అని ఆయనే చాలా నొచ్చుకొన్నాడు. ఒకరోజున ఆయన మాతో, 'అమ్మాయిల్లారా! మీరు నిత్యమూ నాకు పాలు తెచ్చి కాచిపెట్టి యిస్తూ శ్రమపడుతున్నారు. మీకు నేనుకూడా యేమైనా సాయంచేయవద్దా? మీరు పుస్తకాలు తెచ్చుకోండి-చదువు చెపుతాను' అని పంతులు చెప్పగా, ఎగిరి గంతేశాము."

బాటసారి:—"పట్టి పుస్తకాలమోతేనా, ఆపంతులు నిజంగా మీకేమైనా చదువుచెపుతున్నాడా? చెప్పండి"

యశోద:—"అయ్యో, ఆయన మూలాన్న మాకిప్పుడే అక్షరాలన్నీ వచ్చాయి. మా వూరిబళ్లో వాళ్ళింకా 'కాఖాలు' దాటనేలేదు! పంతులెంతో మంచివాడండి—మాకాయన ఓపికతో చదువుచెప్పుతూ, బొమ్మలుచూపిస్తూ, తినుగొండువస్తువులు పెట్టుతుంటాడు-అంత మంచివారెవ్వరూలేరు!"

నేస్తము

విద్యార్థి ఆనందరావునకు యశోదయూ చెల్లెలును అనుదినమును వేళకు మంచిపాలు తెచ్చి కాచి యిచ్చుచు, చిన్నచిన్న యుపచారము లెన్నియో చేయుచువచ్చిరి. అతఁడు వారికి క్రమముగ పాఠ

ములు చెప్పుచు, వారికి బహుమతులిచ్చి పంపుచుం డును. ఇట్టియుభయులకును స్నేహముకలిసెను. ఒంటరిగ పట్టణనివాసము చేయవలసి వచ్చిన యానంద రావునకు యశోదయు దానిచెల్లెలును సహాయురా ండ్రయిరి. ఆబాలిక లాతనిని 'అన్నా' యని పిలువఁ జొచ్చిరి. అతఁడును వారియెడల సోదరప్రేమను గాంచియుండెను. ఇట్లు పాలనెపమున బాలికలకు చదువును, చదువునెపమున నుభయులకుఁ జెలిమి యును, సమకూరెను.

ధనము లేఁజాలని సుఖసౌకర్యములు, సఖ్య సంబంధమున సులభసాధ్యములగుచున్నవి. ఎండ వాన లను మిషపెట్టి పాలు రాకుండుటయు, తోడుబాలను నెపమున నీళ్లపాలు తెచ్చుటయు, గొఱ్ఱెబఱ్ఱెల పాలుగలిపి గోవుపాలని పోయుటయు,—ఆగొల్లపిల్ల లెఱుఁగనే యెఱుఁగరు. ఎప్పుడైన తల్లి యేమఱి నను, ఆబాలికలు క్రమముతప్పక, నిర్మలమాధుర్య మునఁ దమ ప్రేమమునుబోలిన మంచియావుపాలు తెచ్చి యానందరావున కిచ్చుచుండురు. ఆ బాలిక లకుఁ జదువను వ్రాయను నేర్పవలెనని యావిద్యార్థి గట్టిపట్టుపట్టి, వారిచేఁ బుస్తకములును పత్రికలును జదివించుచుండువాఁడు. ఆయువకుని సాయమున తమవిద్య దినదినప్రవర్ధమానమగుచున్నదని గ్రహించి యాబాలిక లానందరావునిదన సోదరప్రేమను బూని, చిన్న యుపచారములు చేయుచు, అతనిని సంతోషపెట్టుచుండురు.

ఇటులొక సంవత్సరము గడచిపోయెను. అను దినము నాబాలికలు ప్రేమపూర్వకముగఁ గొనివచ్చి యిప్పించెడి స్వచ్ఛగోక్షీరములు సేవించు నానంద రావునకు దేహమున మంచి యారోగ్యబలములు చేకూరెను. మేధాశక్తి దీప్తివంతమయ్యెను. విద్య యందు చక్కని యభివృద్ధి గలిగెను. పరుల విద్యాభి వృద్ధికి దానొకింత తోడుపడితినని గదాయని యాతఁడు సంతుష్టాంతరంగుఁడయ్యెను. స్వస్థలమువీడి, పరదేశ మున నివసించుట కాతని మనస్సున నావంతయు వంతలేదు. చెలిమి మూలమున నేర్పడిన యీయిరు వురు చెల్లెండ్రును ఆనందరావున కెన్నిపనులో చేసి పెట్టుచు, అతనియం దమితానురాగము గలిగి యున్నారు. ఇంతకంటె చిన్నవారల కేమిసౌఖ్యము కావలెను?

చనవు

వేసవికాలపు సెలవులు సమాప్తినొందెను. తమ యనుంగు సోదరుఁడు ఆనందరావును విడిచియుండిన యీరెండుమూఁడు నెలలును, ఆ గోపబాలికలకు రెండుమూఁడు యుగములయ్యెను! ఋతుప్రారంభ మున చెట్లమీఁది తమ ప్రాఁతనెలవులుసొచ్చు పక్షి జాలమువలె, కళాశాలా విద్యార్థులొక్కరొక్కరె పట్టణమువచ్చి, తమ ప్రాఁతబసలలోఁ బ్రవేశించు చున్నారు. కాని యెన్నటికిని ఆనందరావు పురము నకు రాకుండుటవలన యశోదకుఁ జెల్లెలికిని ఆలజడి కలిగెను. అనుదినమును వారాతని వెనుకటిబసకుఁ బోయి, తమ మిత్రునిగూర్చి యడుగుచువచ్చిరి. ఈ మాయాతఁడు పట్టణము రాకపోవచ్చునని యొక్కొక మాఱును, కుటుంబముతోవచ్చి వేఱుబస మాడుకొన వచ్చునని యొక్కొకమాఱును వారికి వినవచ్చు చుండెను. కొన్నిదినములనంతరము ఆనందరావుకొఱకై ఖాళీగా నుంచఁబడినగదిలో, ఇందుకు వేఱొక విద్యార్థి ప్రవేశించెను. తమ యన్న యానందరావు కుర్చీవేసికొని కూర్చుండుతావున క్రొత్తమనుజుని బిచానా పరచియుండుటయు, పత్రికలు బొమ్మల పుస్తకములు నుండుచోట నన్యుని కాలిజోడు కానఁ బడుటయు, టిక్కుటిక్కుమను గడియారముండు గూటిలో సిరాబుడ్డియు, కలములు దాచఁబడుటయు, సతత మందహాసమున వెలుఁగు వదనపద్మముగల తమ యన్న యానందునిస్థానమును పుస్తకములు ముందు వేసికొని మొగము ముడుచుకొని కూర్చుండు నన్య విద్యార్థి యాక్రమించుటయును,—పాప మా కోమల హృదయులగు గోపబాలికలకు దుర్భరదృశ్యము లయ్యెను! తమ పాపిష్ఠినయనములకేఁ ...నందుని

1018

యానందమూర్తి గోచరింపదని యాబాలికలు దిగులు పడఁజొచ్చిరి.

ఒకనాఁడు తల్లి యేదో పనిమీఁద నంపఁగా, యశోద గోపాలపురమువచ్చి, పని చక్కఁబెట్టుకొని, స్వగ్రామము వెడలిపోవుచుండెను. ఇంతలో చిన్న బజారునొద్ద నొకయింట నానందరావు దిగియుండె ననువార్త యామెకు వినవచ్చెను. తోడనె యత్యాతురమున యశోద యాప్రాంతములకేగి, అన్నకొఱ కింటింట నడిగెను. తమ కాతని సమాచారము తెలియదని కొందఱు పలికిరి. దూరపు టిండ్లలో నెచటనైన నుండవచ్చునని కొందఱనిరి. ఎట్టకేల కానందుని బస యామెకొక్కరు చూపించిరి. అన్నను వీక్షింప నిండుకోరికగల యాబేల హృదయమున ప్రేమరస ముప్పొంగఁగా, యశోద యాగృహముఁజొచ్చి, ఓరగ వేసిన పెద్దగదితలుపు దివాలునఁ దెఱచి, భావోద్రేకమున, "అన్నా!"యని కేక పెట్టి యఱచెను.

గదిలోనుండి యపుడు బయటికి వచ్చినవారు ఆనందరావు కాకుండుటవలన, పాపమాబాల కమితాశాభంగము కలిగెను! "ఎవరు వారు?" అని యపుడు యశోద నడిగిన వారు పదునాఱుసంవత్సరముల ప్రాయముగల యొకసుందరి. "మా అన్నయ్య బస యిదేనా?" అని గోపబాల యామెను ప్రశ్నించి, లోనివస్తువుల యానవాళ్లనుబట్టి యదియేయని నిర్ధారణ చేసికొని, "ఇదిగో నాటక్కు టిక్కుల గడియారము! ఎన్నాళ్ళకు గనఁబడ్డావే మాయమ్మా!" అని పలుకుచు గదిలోఁజొచ్చెను. "పంతులుగారెచ్చటికో వెళ్ళినారు" అని గృహిణి చెప్పుమాటలు యశోద వినక, అన్నయ్య కొత్తబొమ్మల కాకితాలేమి తెచ్చాడో చూదాము!" అని గోపబాల తనలోఁ దాను మాటాడుకొనుచు, బల్లయొద్ద కట్టె పోయి, పుస్తకములు తిరుగవేయఁజొచ్చెను.

భావోద్రేకము—

భావోద్రేకము ఒక విధమగు పిచ్చితనము, హృదయ ముప్పొంగి యుండునపుడు, బుద్ధి యుక్తాయుక్తము లరయనేరదు! అట్టివారల మనస్సీమనుండి యుచితజ్ఞత యురుకలెత్తి పారిపోవుచుండును. గొల్లపిల్ల యొకతె తమగదిలోఁజొచ్చి, తన పతిపుస్తకములు కెలఁకుచుండుటయు, పరపురుషులతో లేనిపోని పరసలుపెట్టుకొని తగనిచనువు గాంచియుండుటయును,—రుక్మిణి కెంతమాత్రమును రుచింపకుండెను! యశోద యంత వెనుకకుమరలి, గుమ్మమునొద్ద చదికిలఁబడి, "వదినయ్యగారూ! మీరెప్పుడు వచ్చారండీ? వెనుకటిబస మానేశారేమండీ?" అని యడిగెను. మొగి మెఱుకలేని హీనజాతి పడుచు తమ గదిఁజొచ్చి, గౌరవమేమియుఁ జూపక తన్నిట్లు సంబోధించుటవలన రుక్మిణి యధికాగ్రహావేశ యయ్యెను. అంత వారియిరువురు కోమలులకును, సంభాషణమను పేర నీసంవాదము జరిగెను.

రుక్మిణి:—"ముక్కూ మొగమూ ఎఱుగనిదానవు నీతో చుట్టరికము కలిపి, నన్నేమి మాట్లాడుమన్నావు? నీ వెవరవు? ఎందుకు వచ్చావేమిటి?"

యశోద:—"ఆలాగు కోప్పడతారేమండీ, వదినయ్యగారూ? గొల్లవాళ్లమైనా మర్యాద గలవాళ్ళమేనుమండీ! అన్నయ్యగారెరుగుదురు మాసంగతి— మీరు పాలెక్కడ పోయించుకుంటున్నారు?"

రుక్మిణి:—మీ మర్యాదలతోను, వావివరసలతోను మాకేమీపనిలేదు—మీపాలు మాకక్కరలేదు కావలిస్తే కబురంపుతాములే—వెళ్లిపోవచ్చును."

యశోద:—"ఆలా పొమ్మంటారేమండీ వదినయ్యగారూ? మిమ్మల్ని చూదామని యిన్నాళ్ళనుండీ కలవరిస్తున్నామండీ! అన్నయ్యకై చెల్లీ, నేను బెంగపెట్టుకొనే యున్నాను. పాలు కాకపోతే నెయ్యో పెరుగైనా అక్కరలేదా? మంచివే తెచ్చిపెట్టుతాము లెండి!"

శ్రుతిమించుచుండెడి యాప్రాతబంధములు పగులఁగొట్టుట పరమధర్మమని భావించిన యిల్లాలు రుక్మిణి, "ఓసీ పిల్లా! మాకు నీ నేయి పెరుగులూవద్దు నేస్తాలూ వద్దు! వచ్చిన దారినే వెళ్లిపో! కావలెనంటే.

1019

మా మగవారు కబురంపుతారులే!" అని పలికి, ముఖము ముణుచుకొని, తమ గృహమునుండి యెన్నడీ బాలపిశాచమున కుద్వాసనమగునా యని వేచియుండెను. తనతో వికటపుఁబలుకులాడెడి యా గృహిణితో నిఁకఁ బ్రసంగింపనొల్లక, అన్నయె యింట నుండినఁ దనకీ పరాభవము ప్రాప్తించియుండదు గదాయని కంట నీరు తెచ్చుకొని, కోపమున నాగోప బాలిక చివాలునలేచి, యట్టె వెడలిపోయెను!

ఈసు

ఈర్ష్యవంటి చెడుగీలోకమున మఱియొకటిలేదు. ఎంతటి కఠినదురాత్ముఁడును స్వసౌఖ్యమును విసర్జించి మెలఁగు మూర్ఖుఁడుగ నుండఁడు. ఈర్ష్యాళువుమాత్రము పరశ్రేయసుతోపాటు నిజాభ్యుదయమును నీటఁ గలిపి, తానును దుఃఖకూపమునఁ జెరలాడుటకు సంసిద్ధుఁడగుచుండును! ఈ సుగుణము స్త్రీ నావహించినచో, మఱింత వికారరూపమును దాల్చును. ఒకానొక కవివర్యుఁడు, "ఓ యీర్ష్యా! నీపేరే స్త్రీ సుమీ!" యని యంగలార్చెను.

ఆనందరావు నాఁడింటికిఁ జేరినతోడనే, గోప బాలిక దుండగపు సమాచారమును రుక్మిణి నాధునికి నివేదించెను. ఇది విని నవ్వి యాతఁడు "అయ్యో, యశోదా! ఎంత వెఱ్ఱిగొల్లపిల్లవే నీవు! పాపము దానిది పిచ్చిప్రేమలే! —దాని చెల్లెలుకూడా రాలేదా? పుస్తకాలు తెచ్చుకొనివచ్చారా? మఱచి పోయినాను నీతో చెప్పడము. మన యింటికి కావలసిన నేయి పెరుగులు వాళ్ళు జాగ్రతగా తెచ్చి పెట్టుచుంటారులే—మిక్కిలి నమ్మకమైనవాళ్ళు. ఒంటరిగానున్న నీకు మంచి సావాసులుగా నుంటారు కూడాను!

చిట్లించిన మోముదమ్మితో రుక్మిణి, నాకే కొత్త నేస్తు లెవరూవద్దు. నేయి పెరుగులు కావళ్ళు కట్టి మనకు తేనక్కఱలేదు." అని సమాధానమిచ్చెను.

యశోదను గుఱించి తనభార్య హృదయమునఁ బడిన యనుమానాంకురముల జాడ తెలియని యానందరావు, "కావలసిన వస్తువులే వాళ్లు తెచ్చిపెట్టుతుంటారులే—గొల్లవాళ్లయినా స్నేహపాత్రులు— నీతో గలసి చదువుకుంటూ, ఇంట్లో సందడిగా నుంటారులే!" అని పలికెను.

"ఈ పట్నవాసములో వస్తువులన్నీ యింటిపద్దకే అమ్మవచ్చుచున్నవి. ఇంక పరసలుపెట్టుకొనే పొరుగూరి అమ్మలక్కల వాడుకలు మనకెందుకు? ఎవరికితగ్గ సావాసములు వారికి ఇరుగుపొరుగులనే కుదురుతారు గాని, పల్లెటూరి గొల్లవాళ్ళ చెలిమి నాకెందుకు? ఆ పడుచుపిల్ల వెకిలివేషం నాకేమీ బాగాలేదు. అటువంటి వాళ్ళను మనయింట్లో జేర్నిస్తే, మీ తలమీద తప్పక అక్షింతలగింజలు పడతవి సుమండీ!" అని రుక్మిణి పలికెను.

ఈ కడపటి పలుకులు ములుకులవలె చెవికి తగులునప్పటికిఁ గాని, గొల్లపిల్లయెడల తనభార్యకుఁ గలిగిన యనుమానముల సంగతి యానందరావునకు స్ఫురింపనేలేదు! అప్పుడైన నతఁడు సతివారింపు వచనములు లెక్కసేయక, యశోద సామాన్య బాలల వంటిది కాదనియు, దానికిని దాని చెల్లెలికిని చదువు నందమిత వాంఛగలదనియు, ఎటులైన నా బాలికలకు విద్యాకౌశలమునఁ దమకు సాయము చేసి, వారివలనఁ దామును గొంత సాయముగొనుటవలని తప్పేమియు లేదనియును, ఆనందరావు సమాధానము చెప్పి, అంతటితో సతిసందియములు నివారితమయ్యెనని యనుకొనెను. ఐన నదంతయు నింతతో నంతమొందలేదు.

మఱునాఁడు కూరలబజారులో యశోదయు దాని చెల్లెలును ఆనందరావునకుఁ గానఁబడిరి. అతని భార్యతో ప్రథమ సంభాషణలోనే తమకుఁ గలిగిన యాశాభంగమునకై పాప మా గోపబాలికలు కంటఁ దడిపెట్టుకొనిరి. ఆనందరావు వారల నూరడించి, తన సతిని సమాధాన పఱచితిననియు, మఱునాఁటి నుండియు వారు తమకు పాలు పెరుగులు తెచ్చి యిచ్చుచు, వెనుకటివలెనే తమయింటఁ జనువు సాగించుకొనవచ్చుననియును, ఆయన వారల కభయ హస్తమిచ్చెను.

1020

మఱునాఁటి నుండియు యశోదయు చెల్లెలును పాలు పెరుగులు గొనివచ్చుచు, ఆనందరావుగారి యింటఁ జదువుకొనుచు వచ్చిరి. రుక్మిణికిఁ గావలసిన చిన్న చిన్న పనులు చేసిపెట్టవలెనని యామె వెనువెంట నెంత వినయవిధేయులతో వారు తిరుగుచుండినను, అభాగ్యశాలిని వారిని గన్నెత్తియైనఁ జూడకుండెను! ఇంక వారికి నామెయందు మనసు గలియుటెట్లు? ఆనందరావు సాహాయ్యమున నాబాలికలను దినమును గొంతసేపు చదువుకొని, అతఁడు కర్మశాల కేగు సమయమున స్వగ్రామమునకు వెడలిపోవుచుండిరి. ఇట్లు గృహయజమానుని యాజ్ఞ ననుసరించియే, హృదయ సమ్మేళనములేని నిర్బంధసహవాసభాగ్యమును, ఆ ముగ్గురు కాంతలు ననుభవింపుచుండిరి!

సమాధానము

కాలమెపుడు నొకరీతిని గడువదు. ఒకసమయమున జరుగని కార్యము, వేఱొకసమయమునఁ గొనసాగుచున్నది. క్రొత్త ప్రదేశమునకు వచ్చిన కొంత కాలమునకు రుక్మిణికి శరీరస్వాస్థ్యము తప్పెను. దగ్గు పడిసెములతో నామె దేహమున నంకురితమైన వ్యాధి విశేషము విషజ్వరముగఁ బరిణమించి ఘన వైద్యులకును లొంగకుండెను. ఐనను, అనుభవశాలి యగు వైద్యుఁడు సంజీవరావునాయుని యోర్పు నేర్పుటిలసనములఫలితముగ, ఎట్టకేలకు రుక్మిణి యారోగ్యవతి యయ్యెను. ఆ యిల్లాలు మంచమెక్కినవాలుగువారములును, పరదేశమున వారి కాపుర మెట్లుసాగెనో, మూలపడి మూలుగుచుండెడి యామెకుగద నెవరు పరిచర్యలు చేసిరో తెలియునా? వెనుక రుక్మిణి తనయింటనుండి వెడలిపొమ్మని గెంటివైచిన గోపబాలికలే యీదినములం దాగృహిణికి దిక్కయ్యెను! ప్రేమార్ద్రహృదయగు సోదరివలెనే యశోద రుక్మిణి కన్ని యుపచారములును జేయుచు, ఆనందరావునకు ధైర్యము చెప్పుచు వచ్చెను. ఆమె చెల్లెలును వారికిఁ గావలసిన బజారు వెచ్చములు తెచ్చియిచ్చుచు, లెక్కలేని చిన్నపను లీటుఁ జేయుచుండెను. ఆ యక్కచెల్లెండ్ర నిజస్వభావ మిప్పటికి బాగుగ గ్రహించిన రుక్మిణికి వారిపుడు ప్రాణమిత్రులయిరి! వారియెడల రుక్మిణి కిపుడవ్యాజప్రేమము కుదిరెను. ఆ గోపబాలికలతోఁ గలసి చదువు కొనుటకుఁగాని, ప్రేమ ముట్టిపడు నట్లు వారిని వరుసలుపెట్టి పిలుచుటకుఁగాని, ఇపుడు రుక్మిణి కించుకయు సంకోచము లేదు! ఆబాలలకును తన పతికిని గలచెలిమి స్వచ్ఛపవిత్ర ప్రేమ బంధమె యని యిపుడు స్పష్టపడి, అట్టి నిరపరాధుల యెడ నిన్నాళ్లును దాను వహించిన నిర్దయత్వమునకు రుక్మిణి మిగుల లజ్జనొందెను. సుస్వభావలగు నాగోపికలకుఁ దానిపుడెట్టిమేలు చేసినను, వారికిఁ దాను వెనుక గావించిన యపరాధమునకుఁ దగిన ప్రతీకారము కానేరదని యాసుదతికి స్పష్టమయ్యెను!

వైద్యుఁడు సంజీవరావునాయుఁడు తమకుఁజేసిన యుపచారమునకై యానందరావు అతనిని తగిన రీతిని గౌరవింపఁగోరి, ఆయన నొకనాఁడు తమ యింట విందుచేసెను. సంగీత సభానంతరమున ఆనందరావు తాను సమర్పింపఁబూనిన రూపాయిల పొత్తి తాంబూలమున నుంచి, వైద్యుని హస్తమున నుంచఁబోఁగా, ఆయన యది స్వీకరింపక, వారీయఁగల బహుమతి వేఱొకటి గలదని పలికినపుడు, అచట నుండు నందఱు నాశ్చర్యమందిరి. అంత వైద్యుఁడిట్లు పలుకుచున్నాఁడు:—"ఈ యిల్లాలు వ్యాధితో వెత నొందుచుండు దినములలో, యశోద యను నీ గోప బాలిక యిలువేలుపువలె వీరిని గాచుచు వచ్చెను. ఈబాల సహాయమువలనె రుక్మిణమ్మ దేహస్వస్థత నొందెను. సుశిక్షనొందిన చిరకాల వైద్యాలయానుభవము సంపాదించిన దాదివలె యశోద రోగికా దినములందు పరిచర్యలు సలిపెను. కుశాగ్ర బుద్ధిగల యీ సుగుణవతిని నేను బరిణయము కాఁగోరుచున్నాను. ఆనందరావు పంతుల నీమె యన్నవలె పెంచి, వారి యింట తలలో నాలుకవలె మెలఁగుచున్నది. యశోదకును చెల్లెలికిని యీపంతులె గురువు, దైవమును! వెనుకటి దినములలోఁగూడ నాబాలికలు

1021

తమ గ్రామమునుండి యీపురమందలి యానందరావు పంతులునకు పాలు తెచ్చి పెట్టుచుండు సమయములందు నాకనుల కగఁబడుచుండిరి. మొదటి నుండియును యశోదయందు మిగుల మక్కువ గలిగి యున్నాను. ఆనందరావు పంతులును వారి పత్నియును నాకీ వివాహము చేయించి, నన్ను బహుమానింపఁ గోరుచున్నాను."

సత్పురుషుఁడగు వైద్యుఁడు సంజీవరావునాయని కోరిక సహేతుక మైనదని యందఱు ననిరి. అన్న వదినల యాలోచన ననుసరించుట శ్రేయమని యశోదకును దోఁచెను. ఆమె తల్లియు బంధువులును దీనికి సమ్మతించిరి. అంత నతివైభవమున యశోద సంజీవ రాయుల పరిణయోత్సవము జరిగెను.

ఇపుడు సంజీవరావునాయఁడు గోపాలపురమున పేరువడసిన వైద్యులలో నొకఁడు. కులములు వేఱైనను మనములు పెనఁగలసిన ఆనంద సంజీవరాయుల కుటుంబములలోనివారు, సంపత్సౌహార్దములతో విలసిల్లి, సౌఖ్యాబ్ధినోలలాడుచున్నారు.

కష్టజీవి

శ్రీమతి చిలకపూడి సీతాంబగారు

ఉ॥ పుట్టిననాటనుండియును పూజ్యులకున్ నిరుపేదవారికిన్
పట్టెడన్నమిచ్చి కడుభక్తిని వస్త్రమొసంగి పున్నెముల్
గట్టుకొనంగలేక వృథగా కలకాలముబుచ్చుచుండు నీ
కట్టిడి కష్టజీవి ధర గల్గగజేసితివేల యీశ్వరా॥

ఉ॥ కట్ట దుకూలముల్, సుఖముగా వసియింపను మంచిమేడలున్,
బెట్ట సువర్ణభూషలను, పేర్మివహింపగలేదు, దోయిలిన్
బట్టినవారి ద్రోయుచును పాపములన్ గడియించుచున్న యీ
కట్టిడి కష్టజీవి ధర గల్గగనేల సృజించి తీశ్వరా॥

ఉ॥ కాయమశాశ్వతంబెపుడొ కాలగతిన్ బడిపోవు దానికై
జేయగరానిపాపములుజేయుచు ఘోరదరిద్రతాహతిన్
దోయిలియొగ్గుచున్ కరము దుఃఖములన్ వెతలొందుచుండు న
న్నీయెడ కష్టజీవి ధర నిట్టులయేలసృజించి తీశ్వరా॥

ఉ॥ తీర్థములందు గ్రుంకవలె దివ్యపదంబుల గాంచగావలెన్
అర్థులకన్నవస్త్రముల నచ్చపుభక్తి నొసంగగావలెన్
సార్థములివ్వియే మనుజజన్మముగల్గినయందు; కీగతిన్
వ్యర్థపుకష్టజీవి ధర నక్కట! యేలసృజించి తీశ్వరా॥

ఉ॥ వదలని మోహపాశము లవారితకీర్తిగలంప మంగళా
స్పదమగు నీపదంబులను భావనసేయక దేహగేహముల్
వదిలమటంచునెంచి బహుభంగుల పాపములన్ గడించు న
న్నదయత కష్టజీవి ధర నక్కట! యేలసృజించి తీశ్వరా॥

1022